

# అసంకల్పం

రత్న

"పార్వతీ!"

"ఇదుగో నిన్నే! ఒకసారి యిలా వచ్చి వెళ్ళు." విశ్వనాథం కేక వేశాడు.

సమాధానం రాలేదు.

"అమ్మాయ్ రాధా! అమ్మ యెక్కడుంది? యిలా పిలు."

కొంచెం సేపటికి పార్వతమ్మ వచ్చి గుమ్మంకి ఆనుకుని నిలబడింది.

"నిద్రపోతున్నావా? పెద్దాడికి ఉత్తరం వ్రాసాను." చేతిలో పెన్ను ప్రక్కనపెట్టి పడకకుర్చీలో వెనక్కివాలి అన్నాడు విశ్వనాథం.

"చదవండి"

విశ్వనాథం చదివాడు. "చి. సత్యంని ఆశీర్వదించి నీ తండ్రి వ్రాయునది. ఇక్కడంతా క్షేమము. నీకు వారంరోజుల క్రితం ఒక ఉత్తరం వ్రాశాను. అందినదనుకుంటాను. నీవద్ద నుంచి జవాబుకై యెదురు చూస్తున్నాం. లోగడ వ్రాసిన ప్రకారం రాధకి పెద్దాపురం సంబంధం నిశ్చయం చేశాము. అన్నివిధాలా బాగుంది. లాంఛనాలతో సహా ఆరువేలు కట్నం యిచ్చుటకు నిశ్చయమయిందని నీకు క్రితం ఉత్తరంలో వ్రాశాను." విశ్వనాథం ఆగి భార్య ముఖంలోకి చూసాడు.

"వింటున్నాను చదవండి."

"పెళ్ళి ఖర్చులు, అవీ పైన యింకొక నాలుగువేలయినా అవుతాయి. మీ చదువులకి పోను మిగిలిన ఒక యెకరం అమ్మితే నాలుగు వేలు వస్తాయనుకుంటాను. మిగిలిన సొమ్ము ఏదో విధంగా మీ అన్నదమ్ములిద్దరూ చూడవలసి ఉంటుంది. శేషగిరికి కూడా పరిస్థితులు తెలియబరచినాను. తనకి చేతనయిన సహాయం చేస్తానని వాడు వ్రాశాడు. బహుశ మూడు, నాలుగువేలు సర్దుబాటు చేయగలడని అనుకుంటున్నాను. నీవు కూడా కొంచెం సహకరించి కుటుంబమునకు తోడ్పడితే పెద్దవాళ్ళం సంతోషిస్తాము. ఉన్నది ఒక్క తోబుట్టువు. ఇది మీ అన్నదమ్ముల బాధ్యత. నీవు పెద్దవాడివి యింతకంటె వివరంగా వ్రాయ నవసరంలేదు. పిల్లలు ఆరోగ్యంగా ఆడుకుంటున్నారని తలుస్తాను. కోడలికి నా ఆశీస్సులు. ముహూర్తం నిశ్చయించగానే తెలియబరుస్తాను. బహుశ ఆట్టే వ్యవధి ఉండదు. వెంటనే జవాబు వ్రాయి.

ప్రేమతో
నీ తండ్రి విశ్వనాథం.

విశ్వనాథం ఉత్తరం మడత పెట్టి కవరులో తోసాడు.

"రాధా! ఈ కవరు అంటించి కాస్త పోస్టులో వేసిరా"

"సరిపోయింది. యింకా యెన్నాళ్ళు? పెళ్ళి కాబోతున్న పిల్ల! అదెందుకు? రాధా ప్రక్కింటివాళ్ళ అబ్బాయి కియ్యి. వేసి వస్తాడు. అయినా యివాళ పోస్టు యింకా రాలేదు. యివాళ వస్తుందేమో సత్యం దగ్గర నుంచి." పార్వతమ్మ భర్తకేసి తిరిగి అంది.

"ఆ! వారంరోజుల నుంచి చూస్తున్నాం. వచ్చినట్టే."

పార్వతమ్మ మాట్లాడలేదు.

"పెళ్ళి గురించి వ్రాసాను కదూ! డబ్బు పంపాలని భయంవేసి ఉంటుంది. ఎవరూ వేలు కదల్చకపోతే యెలా అవుతుందనుకున్నాడో?" విశ్వనాథం చిరాకుగా అన్నాడు.

"వాడి దగ్గర అసలు డబ్బుందో లేదో."

"ఏం? ఎందుకు ఉండదు? పదేళ్ళ నుంచి ఉద్యోగం చేస్తున్నాడు. ఉన్నది పట్నమా? ఏమయినా, వచ్చిన రెండువందలూ యేం చేస్తాడు? యింటికి యెలాగూ పంపడు. ఎరగడా చెల్లెలు పెళ్ళి కెదిగిం

దని?" విశ్వనాథం మరింత కోపంగా అన్నాడు

పోస్ట్‌మాన్ కేక వేశాడు.

విశ్వనాథం లేచి ఆతృతగా అందు కున్నాడు. ఉత్తరం చదువుచున్నంత సేపు భర్త ముఖంలో భావాలు చదువుతూ నిలుచుంది పార్వతమ్మ.

"ఎవరు?"

"వియ్యంకుడు." విశ్వనాథం చదవటం ముగించాడు. "ఈ నెల 27న ముహూర్తం బాగుందిట. అబ్బాయికి అది సెలవుకి వీలుగా ఉందిట. అందుచేత అది నిశ్చ యిద్దామని వ్రాశాడు."

"ఇంత త్వరగానా. గట్టిగా పదిహేను రోజులు కూడా లేదే." పార్వతమ్మ కంగారుగా అంది.

అసలు యింతవరకూ కట్నం సొమ్ము వెయ్యికూడా సమకూరలేదు. పొలం అమ్మకం సొమ్ము వారంరోజులలో వస్తుందనుకో. మిగిలి వదో! నేనింకా టైముంది కదా అని కూర్చున్నాను. వీళ్లేమో ఆఖరినిముషం వరకూ తేలరు." విశ్వనాథం కొడుకుల నుద్దేశించి అన్నాడు.

"శేషగిరికి టెలిగ్రాం యివ్వండి. పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. వాడి దగ్గర ఉండక పోదు. వెంటనే పంపించమనండి. అంతగా పూరిగా తన దగ్గర లేకపోతే ఎక్కడయినా పంపాదిస్తాడు." పార్వతమ్మ విశ్వాసంగా అంది.

కొంచెం ఆలోచించి విశ్వనాథం అన్నాడు "అంతే చేయాలి మరి."

"టెలిగ్రాంలో అన్ని విషయాలు తెలియవు పోనీ యివాళ హైదరాబాదు వెళ్లిరానా యేమిటి?" విశ్వనాథం భార్యముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

"పోనీ ఆపని చేయండి. డబ్బు మీతో కూడా తీసుకురావచ్చు. వీలుంటే అబ్బాయిని, కోడలిని వెంటతీసుకువచ్చేయండి. ఆట్టే రోజులు కూడా లేదు."

"సరే అయితే. ఆ తెలుగు కేలండరు యిలా పట్టా. సంచీలో నాలుగు పంచలు పెట్టు. తరువాత పెట్టో. నిన్న రంగయ్య యిచ్చిన నాలుగువందలు తీసుకురా. వీలుంటే రాజమండ్రిలో పెళ్ళి బట్టలు కొంటాను. ఎలాగూ వచ్చేటప్పుడు సత్యం దగ్గర దిగాలి కదా. వాడి దగ్గర యెంతుందో యేమిటో."

"పెళ్ళి బట్టలకి సత్యం దగ్గర ఉండక పోదు. మీరు తీసుకుని వెళ్లడమెందుకూ డబ్బు?"

"అవుననుకో. పోనీ యెందుకయినా మంచిది దగ్గర ఉంచుతాను. రాధా!" విశ్వనాథం పిలిచాడు.

"అదుగో ఆ ఉత్తరం పోస్టులో వేయించడానికి ప్రక్కింటికి వెళ్లినట్టుంది. మీ బండి నాలుగు గంటలకి కదూ. రెండు గంటల నుంచి వర్షం ఉంది. యేంచేస్తారు?

"ఏంచేస్తాం? యిప్పటి నుంచీ ఆస్టేషనులోనే కూర్చుంటాను. ఆ సంచిలో నా భగవద్గీత కూడా పెట్టు."

విశ్వనాథం బట్టలు మార్చుకున్నాడు.

ఇదుగో డబ్బు. యెక్కడ పెట్టుకుంటారు? రుమాలులో కట్టనా?"

"పర్వాలేదులే. జేబులోనే పెట్టుకుంటాను. లాల్చీయేగా. ఏదీరాధ యింకా రాలేదేం?"

"మీకు ఆలస్యం అవుతుంది. వర్షం వచ్చేస్తుందేమో. బయలుదేరండి" పార్వతమ్మ హెచ్చరించింది.

"సరేలే" విశ్వనాథం మెట్లు దిగుతూ ఉండగా రాధ యెదురు వచ్చింది ఆశ్చర్యంగా చూస్తూ.

"శకునం బాగుంది. వెళ్లిరండి. ఆలశ్యమయితే ఒక కార్డుముక్క యిక్కడికి వ్రాసి పడేయండి." పార్వతమ్మ సంతృప్తిగా అంది.

"అలాగే. వస్తాను" విశ్వనాథం అడుగు ముందుకు వేశాడు. విశ్వనాథం వీధి మళ్లే వరకూ అలాగే చూస్తూ నిలుచున్నారు తల్లీకూతుళ్లు.

* *

మర్నాడు ప్రొద్దున్న పదిగంటలకి చేరుకొన్నాడు విశ్వనాథం హైదరాబాదు. బస్సులెక్కి యిల్లు చేరేసరికి యింకొక గంట పైన పట్టింది.

సరిగా శేషగిరి ఆఫీసుకి వెళ్తూ యెదురయ్యాడు.

"అదేమిటి నాన్నా! యిలా వచ్చేసావు? పోనీ ఉత్తరం వ్రాస్తే స్టేషనుకి వచ్చేవాడినిగా. లలితా! నాన్న వచ్చారు." శేషగిరి కేక వేశాడు. విశ్వనాథం కుర్చీలో ఆయాసంగా చేరగిలబడ్డాడు. లలిత గుమ్మంలో వచ్చి నిలుచుంది.

"ఏమమ్మా? అంతా కులాసాయేనా? అమ్మానాన్న దగ్గరనుంచి ఉత్తరాలు వస్తున్నాయా?" విశ్వనాథం ప్రశ్నించాడు.

లలిత సమాధానంగా తల ఊపింది.

"కాఫీని చల్లని మంచినీళ్లు తెచ్చిపెట్టు తల్లీ. యీ ప్రయాణం కాదు కాని ఒళ్లు హూనం అయింది." విశ్వనాదం కోడలితో అన్నాడు. ఆమె లోపలికి వెళ్లింది.

శేషగిరి వాచీ చూసుకున్నాడు.

"ఆఫీసుకి వెళుతున్నావా యేమిటి?" విశ్వనాథం కొడుకుతో అన్నాడు.

"ఊ. టైమయిపోయింది. నువ్వు స్నానం, భోజనం అదీ చేసి విశ్రాంతి తీసుకో. మధ్యాహ్నం వస్తాను మళ్లీ. ఏమిటి హడావుడి? ముహూర్తం నిశ్చయించారా?"

"అవునురా. 27న నిశ్చయించారు. నిన్ననే వాళ్ల దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. సరేలే వెళ్లు. మధ్యాహ్నం కొంచెం పెందరాళే యింటికిరా. కొంచెం మాట్లాడాలి. వీలుంటే రాత్రి బండికి యింటికి వెళ్లిపోతాను."

"అంత తొందరేముంది? మధ్యాహ్నం వస్తాను. ఇదుగో వీరయ్యా! బాబుగారికి నీళ్లు తోడు. స్నానం చేస్తారు." శేషగిరి నౌకరుతో చెప్పి హడావుడిగా బయలుదేరాడు.

విశ్వనాథం మంచినీళ్లు త్రాగి విశ్రాంతిగా వెనక్కి వ్రాలి పడుకున్నాడు. మనసులో సంతోషంగా ఉంది కష్టపడి, చదువు చెప్పించినందుకు శేషగిరి ప్రయోజకుడయ్యాడు. పెద్ద ఉద్యోగం! నలుగురిలో పేరు! ప్రతిష్ఠ! యింటి దగ్గర ఎప్పుడూ నౌకర్లు! కోడలు కూడా అయినింటి పిల్ల. రాజాలాంటి జీవితం. తనంటే యిద్దరికీ యెంతో గౌరవం.

విశ్వనాథంకి అసలు సంగతి జ్ఞాపకం వచ్చింది డబ్బు ఎంత సర్దగలడో? తనెప్పుడూ వాడిని అడగలేదు. బాంకులో దాచుకుని ఉండాలి. ఒకవేళ అనుకున్న దానికి వందో, రెండువందలు తక్కువయితే అప్పుతేగలడు. బోలెడు పలుకుబడి. విశ్వనాథం సంతృప్తిగా కళ్లు మూసుకున్నాడు.

గడియారం రెండుగంటలు కొట్టింది.

విశ్వనాథంకి మెలకువ వచ్చింది. ఫాను గాలి వెచ్చగా తగులుతోంది. శేషగిరి మాట వినపడింది.

"నాన్న డబ్బు అడగడానికి వచ్చినట్టున్నాడు."

"నేనప్పుడే అనుకున్నాను." కోడలి కంఠం.

విశ్వనాథం లేవబోయి మళ్లీ పడుకున్నాడు.

"మొన్న ఉత్తరానికి మీరు జవాబు ఏమని

వ్రాసేరేమిటి?" కోడలు అడిగింది.

"నా చేతనయినదేదో చేస్తానని వ్రాసాను"

"అలా యెందుకు వ్రాసారు? తిన్నగా వ్రాయక. పోనీలెండి. యిప్పుడయితే యేమయింది? వెయ్యి, పదిహేను వందల కంటె యివ్వలేమని చెప్పండి."

విశ్వనాథం గుండెలో రాయిపడింది. కొడుకేమంటాడో వినాలని చెవులు రిక్కించాడు. మాటలు వినపడలేదు. విశ్వనాథంకి భయం వేసింది. ఫాను గాలి మరింత వేడిగా ఉంది. స్విచ్ ఆఫ్ చేశాడు.

"బాగా నిద్రపట్టిందా?" శేషగిరి గదిలోపలికి వచ్చాడు.

"లలితా! నాన్న లేచారు. టిఫిను పట్టుకురా." శేషగిరి కేకేసాడు.

"ఇప్పుడేం వద్దురా. ఆలస్యంగా భోజనం చేసాను." విశ్వనాథం అన్నాడు.

శేషగిరి అవీయివీ మాట్లాడుతున్నాడు. ప్రమోషనులు! ఆఫీసు గొడవలు! రాజకీయాలు అరగంట గడచిపోయింది. విశ్వనాథంకి చిరాకుగా ఉంది. డబ్బు మాట యెత్తడు!

చివరికి తనే అన్నాడు. "పొలం అమ్మకం పెట్టాను."

"ఎంత బేరం వచ్చింది?"

"నాలుగువేలు. స్టాంపు ఖర్చులు మూడు వందలుపోతాయి."

"ఓహో!" అని ఊరుకున్నాడు శేషగిరి.

విశ్వనాథంకి యింక యెలాగ మాట్లాడాలో తెలియలేదు. చాలాసేపు యిద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారు.

చివరికి శేషగిరే ప్రారంభించాడు. "చేస్తున్నది పెద్ద ఉద్యోగమన్న పేరేగాని యేమిటో యేమీ మిగలటంలేదు. ఇంటి అద్దె ఒక్కటే వందరూపాయలు. ఈ ఊళ్లో ధరలు మరీను. పదిరూపాయల నోటు ఒక్క రోజుతో సరి. దానికి తోడు ఎవరో ఒకరు స్నేహితులు వస్తుంటారు కదా!"

విశ్వనాథంకి ఒళ్లు మండింది. ఎవడికి కావాలి? జమా ఖర్చులు! యిదంతా తనెక్కువ యివ్వలేనని చెప్పడం కాబోలు. డొంకతిరుగుడు. తను ఆశలన్నీ వీడి మీద పెట్టుకుని వస్తే యిదీ ఫలితం!

విశ్వనాథం కోపం దిగమింగి కూర్చున్నాడు. తనదీ అవసరం. తనూ కోపగిస్తే కార్యం అవతే చెడుతుంది.

"అది కాదురా మరి ఉన్నది కాస్తా అమ్మి చదువులు చెప్పించాము. రాధ మెడలో గట్టిగా మూడుకాసుల బంగారం లేదు. మీరు పైకి వచ్చారు. మరి యేదో మాకూ ఆశలుంటాయి. అయినా ఉన్నది యెందరు? ఒక్క ఆడపిల్లగదా. చూసి చూసి బికారి చేతులలో పెట్టలేము కదా! ఈ ఒక్క కార్యం తీరిందంటే మీకింకేమీ బాధ్యతలుండవు. మీ జీవితాలు మీవి." విశ్వనాథం ఆగి కొడుకు ముఖంలోకి చూసాడు.

విశ్వనాథం మళ్లీ అన్నాడు. "ఎలాగ లేదన్నా అయిదువందలు సంపాదిస్తున్నావా? ఉన్నది భార్యాభర్తాను. మరి కాస్త మిగుల్చుకోవాలి. రేపు నీకు కూడా పిల్లలు పుడతారు. జాగ్రత్తపడకపోతే యెలాగ? యేదో నువ్వే పెద్ద సహాయం చేస్తావని ఆశతో వచ్చాను."

చివరికి విశ్వనాథం కొంచెం కోపంగా, నిష్ఠూరంగా మనసులో మాట అడిగేసాడు.

"మరి నా దగ్గర మాత్రం ఎక్కడ మిగిలింది? క్రిందటి నెలలోనే స్కూటరు కొన్నాను. యిన్స్యూరన్సు కట్టాలి. లలితకెపుడూ యేదో అనారోగ్యం. డాక్టరు బిల్లులు వందలకి వందలు అవుతున్నాయి. మీరు యింకా నేనేదో దాచుకుని యివ్వటం లేదనుకుంటారు." శేషగిరి అన్నాడు.

"డబ్బు లేదని మావాళ్లు యీ వేసంగిలో కాశ్మీరు వెళదామని రమ్మంటే కూడా మానేసాము." గుమ్మంలో నిలుచుని లలిత అంది. విశ్వనాథం శరీరంలో ప్రతి అణువు మండిపడింది.

"ఏం? స్కూటరు కొనకపోతే ప్రాణం పోయిందా" అని అందామని నోటిదాకా వచ్చి ఆగిపోయాడు. చివరికి అందరూ కలిసి తనని నట్టేట్లో ముంచుతారు కాబోలు.

"మరి యెవరికి వారు చేతులు ముడుచుకు కూర్చుంటే యెలాగరా?" నీరసంగా అన్నాడు విశ్వనాథం.

"నా దగ్గర ప్రస్తుతం వెయ్యి రూపాయలు ఉన్నాయి బ్యాంకులో. పెళ్లినాటికి బహుశ యింకొక అయిదువందలు తీసుకు వస్తాను." శేషగిరి స్థిరంగా అన్నాడు.

పెళ్లి ఖర్చులో బోడి పదిహేను వందలు యేమూలకి? విశ్వనాథం మనసులోనే విసుక్కున్నాడు.

"అన్నయ్య యెంతిస్తున్నాడు?" శేషగిరి మనసులో సందేహం బయటపెట్టాడు.

"వాడింకా జవాబు వ్రాయలేదు." విశ్వనాథం నిస్పృహగా అన్నాడు.

మళ్లీ కొంచెం సేపు మౌనం ఆక్రమించింది. ఆరువేలు కట్నమేమిటి? పోనీ యే మూడు, నాలుగు వేలలోనో తగ్గ సంబంధం చూడలేకపోయారా?"

విశ్వనాథంకి చిర్రెత్తింది. "ఒరేయి! పనికిమాలిన కబుర్లు చెప్పకు. తల తాకట్టు పెట్టిచేస్తాను పెళ్లి!" కోపంగా అన్నాడు.

"సరే అయితే మరి నేను చేయగలిగింది చెప్పాను. నా పరిస్థితులు అలాంటివి" శేషగిరి అన్నాడు.

"యేమిటిరా పరిస్థితులు? ఇది నీ చెల్లెలు పెళ్లి. వీధినపోయే వెంకమ్మది కాదు. సరేలే యింకెందుకు? నేను వచ్చిన పని త్వరగానే అయింది. సాయంకాలం నేను వెళ్తున్నాను" విశ్వనాథం చిరాకుగా అన్నాడు.

"భోజనంచేసి రాత్రి బండికి వెళ్ళవచ్చుగా"

"ఎందుకు? అవసరంలేదు. పోనీ డబ్బు యివ్వలేనన్నావుసరే. పోనీ యెక్కడయినా అప్పు అయినా తేగలగా ఒక అయిదువేలు?"

విశ్వనాథం అడిగాడు.

శేషగిరి మాట్లాడలేదు.

"ఏరా! మాట్లాడవేం?"

"దొరుకుతుందికానీ..... నేను యిక్కడ అందరినీ అడగడం బాగా ఉండదు. మన వూళ్లో ప్రయత్నించకూడదూ?"

"ఓహో! నీ ఉద్యోగానికి పరువుతక్కువ. యింకెందుకు నా పాట్లు నేను పడతాను. మీరు దర్జాగా పెళ్లి ముహూర్తానికి దిగిరండి." విశ్వనాథం మండిపోయాడు.

ఇంక అక్కడ ఒక్క నిముషం కూడా ఉండడానికి మనసు ఒప్పటంలేదు.

వెళ్లిపోయేముందు విశ్వనాథం కొడుకుతో అన్నాడు.

"నువ్వు రాలేకపోయినా నీ భార్యనయినా ఒక వారంరోజులు ముందుగా పంపు. పెళ్లి కదా! యేదయినా అవసరం కలుగుతుంది."

"దానికి ఒంట్లో అనారోగ్యం...." శేషగిరి నసిగాడు.

విశ్వనాథం వీధి మెట్లు దిగాడు మాట్లాడకుండా.

"స్టేషనుకి వస్తాను ఉండు."

"అవసరంలేదు" విశ్వనాథం సాగిపోయాడు.

పెళ్లి యెలాగ జరుగుతుంది? విశ్వనాథంకి అంతా కంగారుగా ఉంది. యింకొక అయిదువేలన్నా లేనిదే పెళ్లి జరుగదు. ఎక్క

డని అప్పు దొరుకుతుంది? వ్యవధిలేదు. ఉద్యోగంచేస్తూ, బాగా సంపాదిస్తున్న చిన్న కొడుకు నిర్వాకం చేసాడు. యింక పెద్ద వాడు సత్యం యేం చేస్తాడు? వాడసలే తప్పించుకుంటాడు. పిల్లా పాపాలేని శేష గిరి అయిదు వందలు సంపాదిస్తూ పది హేను వందలే యిస్తే, యిద్దరు పిల్లలు, తక్కువ జీతం, నేనేం యివ్వగలనంటాడేమో? వా డసలు యింతవరకూ నోట ముత్యం రాల్చలేదు. అసలు మగ పిల్లలకి వుద్యో పెట్టే చదువులు చెప్పించడం తన పొర పాటనిపిస్తోంది. రాధ పెళ్ళికి తను ముందుగా జాగర్తపడవలసింది. వీళ్ళు సంపాదించి ఆ మాత్రం ఉద్ధరించరా అనే ఆశతో వూరు కున్నాడు. చివరకి ఎవరి సంపాదన వారిది. తనేమనగలడు? విశ్వనాథం ఆలోచనలలో మునిగిపోయాడు.

"బాబూ! తమరు కొవ్వూరులో దిగుతా నన్నారుకదూ!" ఆసామి మగతగా కళ్ళు మూసుకున్న విశ్వనాథంని లేపాడు.

"అప్పుడే వచ్చేసిందా ఏమిటి?" విశ్వ నాథం కంగారుగా గెంతి దిగిపోయాడు.

"చిరా సంచి!" కిటికీలోనుంచి అందిం చాడు ఆ మనిషి.

"ఓహో. మరచిపోయాను" కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ అందుకున్నాడు.

యిల్లుచేరేసరికి సూర్యుడు నెత్తిమీద నిలుచున్నాడు. యింటికి తాళంవేసిఉంది. విశ్వనాథం ప్రాణం ఉసూరుమంది. తను వస్తానని తెలిసి సత్యం భార్యా పిల్లలతో ఎక్కడికయినా వెళ్ళాడా యేమిటి? వీళ్ళు! కొడుకులు! విశ్వనాథం కసిగా పళ్ళ బిగువుక అనుకుంటూ అరుగుమీద కూల బడ్డాడు.

ఏం చేయాలి? లసలు వూళ్ళో ఉన్నారో లేదో? లేకపోతే వాళ్ళ వేళలతో తరువాత బండి యెక్కేయ్యాలి అంతకుమించి గత్యం తరంలేదు.

దూరంగా ఎవరో వీధి చివర వడి వడిగా వస్తున్నారు. విశ్వనాథం చూపు సారించాడు. కోడలు లక్ష్మి! పిల్లాడు.

విశ్వనాథం కుదుటపడ్డాడు.

"ఎంత సేపయిందిమామయ్యా వచ్చి? యెండలో కూర్చున్నారు." తాళం తీస్తూ కొంచెం బాధపడుతూ అంది లక్ష్మి.

"యేదమ్మా. యిప్పుడే వచ్చానమ్మా" విశ్వనాథం యింట్లోకి నడిచాడు.

ఇల్లు బాగా చిన్నది. రెండు గదులు, చిన్న వంటగది. పాత యిల్లు గోడలన్నీ పల్లగా ఉన్నాయి.

"కూర్చోండిమామయ్యా" మంచం వాల్చింది లక్ష్మి.

మజ్జిగ గ్లాసు పక్కనపెడుతూ అడిగింది. "అత్తగారు, రాధా అందరూ కులాసాయేనా? అత్తయ్య పెళ్ళి అని జయ వూరికే సరదా పడుతోంది."

"యేదీ? కనపడదేం?" విశ్వనాథం అడిగాడు.

"స్కూలుకి వెళ్ళింది." లక్ష్మి తలుపు వారగా నిలుచుంది.

విశ్వనాథం కోడలిని పరీక్షగాచూసాడు. యేదో మాసిపోయిన చీర కట్టుకుంది. అక్కడా అక్కడా చిరుగులు. విశ్వనాథం కొంచెం బాధపడ్డాడు. లక్ష్మి ఆయన ముఖంలోకి చూసి తలదించుకుంది.

"స్నానం చేయండి. భోజనంచేద్దురుగాని"

"కొంచెంసేపు విశ్రాంతి తీసుకుని చేస్తాను. నీ పని చూసుకో అమ్మా." విశ్వ నాథం ఆయాసంగా పడుం వాల్చాడు.

దృష్టి గది నాలుగు మూలలా మళ్ళింది. మాసిన బట్టలు చిందర వందరగా దండెం మీద పడి ఉన్నాయి. 'చూస్తే వీడికి వచ్చే డబ్బు సరిపోతున్న ట్టుగా లేదు.' విశ్వనాథం అనుకున్నాడు.

"అమ్మాయ్ లక్ష్మీ! చంటాడిని వం టింట్లో పడుకో బెట్టావేమిటి? యిలాగ తీసుకురా" విశ్వనాథం కేక వేశాడు.

లక్ష్మి పిల్లాడిని మంచం వారగా పడుకో బెట్టింది.

ఈ సారి చీర మార్చుకుని వచ్చింది. తమ బీదరికం తనకి తెలియకూడ దని కాబోలు! చిన్న కోడలికి, పెద్ద కోడలికి సహస్రం తేడా ఉంది. విశ్వ నాథం మొదటి సారిగా అనుకున్నాడు.

"అమ్మాయ్! వీడి కడుపు యిలా యెత్తుగా ఉందేం! ఒళ్ళు కూడా బాగా వేడిగా ఉంది. యేమిటిది?" విశ్వనాథం కంగారు పడ్డాడు.

"మూడు నెలల నుంచి యిలాగే ఉంది మామయ్యా. బల్లయేమో అని అనుకుంటున్నాము. యివాళ కొంచెం జ్వరం యెక్కువగా ఉంది."

"కొంచెం యేమిటి? ఒళ్ళు పేలి పోతుంటేను. అయినా మూడు నెలల నుంచీ ఉంటే నాకెందుకు ఉత్తరం వ్రాయలేదు? డాక్టరెవరు? వైద్యం సరిగా జరుగుతోందా?" విశ్వనాథం ఆదుర్దాగా ప్రశ్నలు కురిపించాడు.

"ప్రక్క వీధిలో ఆయనకి తెలిసిన ఆయుర్వేద వైద్యుడు ఉన్నాడు. ఆయనే చూస్తున్నాడు. ఇవాళ కూడా అక్కడికి మీరు వచ్చే ముందే తీసుకొని వెళ్ళాను."

"మతి లేక పోతేసరి! మూడు నెల లయింది. ఆ వైద్యం, యీ వైద్యం అని నాటు వైద్యం చేయించి జబ్బు ముదర పెట్టుకుంటారా? చివరకి యే మనుకుని ప్రయోజనం? అయినా డబ్బు పారేస్తే వూరి నిండా యింగ్లీషు డాక్టర్లు ఉన్నారు కదా", విశ్వనాథం కోడలి ముఖంలోకి తీక్షణంగా చూసాడు.

లక్ష్మి ఒక్క సెకను చూసి కళ్ళు వాల్చేసింది. ఆ చూపులో విశ్వనాథంకి



ఫాంటు అంత సన్నగా కుట్టించుకోవడమెందుకు - కాలు పట్టడంలేదని సాణగడమెందుకు?

అర్థంకాని భావాలు యెన్నో ఉన్నాయి. వెంటనే బాధపడ్డాడు. ఒకవేళ చేతిలో డబ్బు లేదేమో.

"యేదో మీరందరూ సుఖంగా ఉన్నారనే దూరంగా ఉన్న మేము అనుకుంటాము. కాస్త మాకు యిటువంటివి తెలియబరచక పోతే యెలాగ? డబ్బు యిబ్బందులు లేనిదెవరికి? పెద్దవాళ్లం వెనకాల ఉన్నాంగా." విశ్వనాథం అనునయంగా అన్నాడు.

లక్ష్మి సిగ్గు పడి పోయింది.

"స్నానానికి లేవండి. నీళ్లు తోడాను."

విశ్వనాథం మనసు చికాకుగా అయిపోయింది.

భోజనం చేస్తున్నంత సేపూ యేదో ఆలోచిస్తూనే ఉన్నాడు.

"ఆయన యేదో పని మీద వూరికి వెళ్లారు." లక్ష్మి మంచం మీద ప్రక్క వేస్తూ అంది.

"యే వూరు?"

"యేదో ప్రక్క వూరు. ఎప్పుడు పని పూర్తయితే అప్పుడు వస్తానన్నారు."

"అదేమి టమ్మాయ్! యివతల పిల్లాడికి వంట్లో బాగా లేదు. బుద్ధుండక్కర్లా! అంత పని యేమిటి మించిపోయింది? యిక్కడ అడదానివి ఒక్కర్తివీ యేం చేస్తావని అనుకున్నాడు." విశ్వనాథం కొడుకు మీద కోప్పడ్డాడు.

"ముహూర్తం నిశ్చయించారా?" లక్ష్మి సంభాషణ మార్చింది.

"ఆ. యీ నెల 27 నే. అందుకే కంగారు." విశ్వనాథం అన్నాడు.

"అసలు నిన్నూ పిల్లలినీ నాకూడా తీసుకుని పోదామను కున్నాను. యేదీ, సత్యం వూళ్లో లేదు. చంటాడికి జ్వరం. ఆ పల్లెటూరు యిలాగ తీసికొని వెళ్తే అసలు వైద్యం జరగదు." తనలోతాను అనుకున్నట్టుగా అన్నాడు.

"శేషగిరి, లలిత యెప్పుడు వస్తున్నారు పెళ్లికి?"

"ఇదిగో యిప్పుడు హైదరాబాదు నుంచే వస్తున్నాను. వాళ్లు సరిగా పెళ్లికి వస్తారు. యేమిటో నమ్మా యెలాగ జరుగుతుందో యీ పెళ్లి! యింత వరకు ఒక్కపని జరుగ లేదు. డబ్బు కూడ లేదు. శేషగిరి పెళ్లి నాటికి యెలాగో పదిహేను వందలు యివ్వడానికి నిశ్చయించాడు. యేం

# అసంకల్పం

చెయ్యను చెప్పు?" విశ్వనాథం దిగులుగా అన్నాడు.

"మీరు విశ్రాంతి తీసుకోండి." లక్ష్మి వంటింట్లోకి వెళ్లి పోయింది. అలసట మీద విశ్వనాథం మనసు త్వరగా నిద్రకు లొంగి పోయింది. మనవరాలు జయ మాటలతో మళ్లీ మెలకువ వచ్చింది.

"అమ్మా! తాతయ్య ఎప్పుడు వచ్చాడే?"

"మధ్యాహ్నం. అల్లరి చేయకు నిద్ర పోతున్నారు."

"కాఫీ యియ్యి. తాగుతాను."

"ఊహు! తాతగారికి."

"నాకూ కావాలి."

"తప్పు కదూ. అలా గొడవ పెట్ట వచ్చా."

"మరి నా కెందు కివ్వవు?"

"కాఫీ పొడి లేదమ్మా. పోనీ ప్రక్కింటి వాళ్ల నడిగి తీసుకురా నీకూ యిస్తాను."

"వాళ్లు యివ్వరు. క్రిందటి సారే విసుక్కున్నారు."

"బంగారు తల్లివి కదూ! నాన్న తెస్తారుగా. అప్పుడు త్రాగుదు గాని యేం? యిప్పుడు పంచదార యివ్వనా?"

"అన్నీ అబద్ధాలే. నాకు పంచదార వద్దు."

"పోనీలే కాని, తాతయ్య లేచారేమో చూడు."

"తాతయ్యా! లేచావా?" జయ అరచుకుంటూ దగ్గరకి వచ్చింది.

"ఏం తల్లీ! స్కూలు నుంచి అప్పుడే వచ్చేసావా?" విశ్వనాథం లేచి మనవరాలిని ఒళ్లో కూర్చో బెట్టుకున్నాడు.

"ఇవాళ మధ్యాహ్నం సెలవు."

"జయా!" కోడలు పిలిచింది.

జయ కాఫీ గ్లాసుతో తిరిగి వచ్చింది.

"మనిద్దరం త్రాగుదామేం?" విశ్వనాథం అన్నాడు.

జయ తల అడ్డంగా వూపింది.

"పోనీలే. వేడిగా ఉంది. యింకో గ్లాసు తీసుకురా."

జయ తెచ్చిన గ్లాసులో సగం కాఫీ పోసి చేతికిచ్చాడు.

"అమ్మకి కోపం వస్తుంది." విశ్వనాథం చెవిలో అంది జయ.

విశ్వనాథం గుండె పిండి నట్లయింది. బలవంతంగా త్రాగించాడు. కొంచెం సేపు కబుర్లు చెప్పాడు.

"మొన్న నా పుట్టిన రోజుకి కొత్త బట్టలు కుట్టించ మంటే నాన్న కొట్టారు." జయ ఫిర్యాదు చేసింది.

"జయా!" లక్ష్మి కోపంగా పిలిచింది.

జయ బిక్క ముఖం వేసింది.

"నువ్వు ముఖం కడుక్కునిరా. మనం బజారుకి వెళ్లి బోలెడు కొత్త గౌనులు కొనుక్కుందాం." విశ్వనాథం జయ చెవిలో అన్నాడు. జయ ముఖం వికసించింది.

"అమ్మాయ్! తలుపు వేసుకో. మేమలా బజారుకి వెళ్లి వస్తాం" మనవరాలి చెయ్యి పట్టుకుని వీధిలోకి నడిచాడు విశ్వనాథం.

బజారంతా తిరిగి యింటికి వచ్చేసరికి చీకటి పడుతోంది. వీధిలో యెవరో పెద్ద మనిషి నిల్చుని మాట్లాడుతున్నాడు తలుపు వోరవాకిలిగా తెరచి ఉంది. లోపలి నుంచి కోడలి కంఠం విన పడుతోంది.

"మరి యిలా గయితే యెలాగమ్మా! మేమూ యీ అద్దె మీదే బ్రతకాలి కదా." ఆ వ్యక్తి యేదో అంటున్నాడు.

విశ్వనాథంకి అంతా అర్థ మయింది.

"బాబూ! మీ కెంత యివ్వాలి?" అడిగాడు

మామగారి కంఠస్వరం విని లక్ష్మి తలుపు పూర్తిగా తెరచింది. ముఖం మ్లాన మయింది.

"మూడు నెలల అద్దె అండి. డబ్బయి అయిదు రూపాయలు."

విశ్వనాథం లెక్క పెట్టి యిచ్చేసాడు.

"మాకూ కష్టాలు తెలుసు బాబూ. మేమూ మధ్య తరగతి వాళ్లమే. అబ్బాయి ఉద్యోగం పోయిందని మాకూ బాధగానే ఉంది. యేం చెయ్యగలం చెప్పండి. మా బ్రతుకులు కూడా అటువంటివే కదా. యేమను కోకండి." ఆ వ్యక్తి నమస్కారం చేసి వెళ్లి పోయాడు.

విశ్వనాథం స్థాణువులా నిలబడి పోయాడు. చివరకి నిస్తేజంగా లోపలకి నడిచాడు.

లక్ష్మి తలవంచుకుని లోపలికి వెళ్లి పోతోంది.

"అమ్మాయ్ లక్ష్మీ!" విశ్వనాథం పిలిచాడు

లక్ష్మి దోషిలా నిలబడి పోయింది.

"సత్యం ఉద్యోగం యెందుకు పోయింది?"

"పోలేదు. సస్పెండు చేసారు నాలుగు నెలలు." వస్తూ ఉన్న దుఃఖాన్ని నిగ్రహించడానికి చేసిన ప్రయత్నం ఫలించ లేదు.

"ఎందుకనిట?"

"ఆయన పొరపాటు వల్ల ఆఫీసులో డబ్బు పోయిందిట. సుమారు అయిదు వేలో యెంతో. ముందు ఉద్యోగం పోతుందనే అనుకున్నారు. కాని చివరకి ఆయన దగ్గర ఉన్న రెండు వేలు చిల్లర ఆఫీసులో కట్టేసారు. అందుచేత యింతటితో వదిలేసారు." లక్ష్మి కంఠ స్వరం వణకింది.

"ఎన్నాళ్లయింది? యిది జరిగి"

"ఇది రెండో నెల."

విశ్వనాథం మంచం మీద కూలబడి పోయాడు. యేమిటిదంతా? యేం చేయాలి? కళ్ళు చెమ్మ గిల్లాయి. కాని పూళ్లో డబ్బుకి పెళ్ళాం పిల్లలతో కష్టపడుతూ తన కెందుకు వ్రాయలేదు సత్యం! తను కాని వాడా!

"అమ్మాయ్ లక్ష్మి! అబ్బాయ్ నీతో చెప్పే వెళ్లేడా" కొంచెం మనసులో భయంగా అన్నాడు.

"నిన్ననే వెళ్లారు. హైదరాబాదు వెళ్తున్నానని చెప్పారు. ఈ విషయం గురించే పై ఆఫీసర్లతో మాట్లాడి వస్తానన్నారు."

విశ్వనాథం కొంచెం స్థిమిత పడ్డాడు.

"నువ్వూ పిల్లలూ బట్టలు సర్దుకోండి. రాత్రి బండికి యింటికి వెళ్లిపోదాం." నిశ్చయంగా అన్నాడు.

"వద్దు మామయ్యా. ఆయన యివాళో రేపో వస్తారుగా."

"ఆ, వచ్చి మాత్రం యేం చేస్తాడు?" విశ్వనాథం బాధగా అన్నాడు

ఇద్దరూ ఆలోచనలలో మునిగి పోయారు.

"చంటాడికి జ్వరం యీ పూట యింకా యెక్కువయింది మామయ్యా"

"అవును సుమా. ఆ సంగతి మరచే పోయాను. ముందు వాడిని యెత్తు కొనిరా. ఎవరయినా డాక్టరుకి చూపించుదాం."

లక్ష్మి విశ్వనాథం మాటకి ఎదురు చెప్పలేదు.

"ఆలస్యం చేసారండి. అయినా పర్వాలేదు. ఒకవారం, పది రోజులలో తగ్గుతుంది." డాక్టరు పరీక్ష చేసి యింజెక్షను యిచ్చాడు. యింకా యేవో మందులు కొనమని వ్రాసాడు.

రాత్రి పడుకునే ముందు విశ్వనాథం డబ్బు లెక్క చూసాడు. ఒక వందలోపు ఉంది.

"అమ్మాయ్, రేపు మీ అత్తయ్యకి ఒక కార్డు వ్రాసి పడెయ్యి నేనింకో రెండు రోజులకి కాని రానని."

"అయ్యో! పెళ్లి అట్టే రోజులు కూడాలేదు. మీరు వెళ్లండి మామయ్యా! ఆయన వస్తారు." లక్ష్మి విశ్వాసంగా అంది.

విశ్వనాథం ఆలోచించాడు ఆమాట కూడా నిజమే. బోలెడు పనులు!

"అవుననుకో. యీ అడవిలో మిమ్మల్నిలా వదలి వెళ్లడం ఎలా? సరేలే. ఉత్తరం వ్రాయక. రేపు సాయంకాలం" వరకు చూసి బయలు దేరతాను.

మర్నాడు కూడా సత్యం రాలేదు. ప్రొద్దున్నే వెళ్లి నెలకి సరిపడే పప్పులు ఉప్పులు అన్నీ మోయించుకుని వచ్చాడు విశ్వనాథం. లక్ష్మి విస్తు పోయింది.

సాయంకాలం బయలు దేరాడు విశ్వనాథం.

"లక్ష్మి! చంటాడిని రోజూ ఆ డాక్టరు దగ్గరకి తీసుకుని వెళ్ళు. అశ్రద్ధ చేయకు. యేమీ కంగారులేదు. దేనికినీ యిబ్బంది పడకండి. సత్యం రాగానే అందరూ కలిసి బయలుదేరి వచ్చేయండి. నేను ఉందామంటే చేతి నిండా పనులు! ఇదిగో! ఈ పాతిక రూపాయలు దగ్గరుంచుకో. ఏందుకయినా అవసరం. సత్యం యీలోగా వస్తే ప్రయాణం ఖర్చులకి ఉంటాయి. నేను యింటికి వెళ్లి యింకొక ఏభయి పంపిస్తాను. మరి నేనింక ఉండనా!" విశ్వనాథం మనవరాలిని ముద్దు పెట్టుకున్నాడు.

ఇంతలో పోస్టుమాన్ వచ్చాడు. విశ్వనాథం అందుకుని చూసాడు. కవరు! తను వ్రాసినదే బయలుదేరే ముందు. విశ్వనాథం పెదవుల మీదకి చిన్న చిరునవ్వు వచ్చింది. తను బయలు దేరిన ఉద్దేశ్య మేమిటి? జరిగిం దేమిటి? కవరు జేబులో పెట్టు కున్నాడు. విశ్వనాథం రెండడుగులు వేసి ఆగిపోయాడు.

"సత్యం వస్తే దిగులు పడ వద్దన్నానని చెప్పు. పెళ్లేమీ ఆగి పోదు. అవసరమయితే ఆ యిల్లు కూడా అమ్మేస్తాను" విశ్వనాథం వెనక్కి తిరిగి దృఢంగా అన్నాడు.

లక్ష్మి క్రింద పెదవిని మునిపండ్ల మధ్య నొక్కిపెట్టి మనసులోని—అదేమిటో అవ్యక్తం— అణచడానికి ప్రయత్నించింది. కనుల నుండి రెండు వెచ్చని నీటి బిందువులు జారి పడ్డాయి. మసకగా అయిపోతున్న మామగారి వంక కృతజ్ఞతతో చివరివరకూ చూసింది.

గుమ్మంలో అడుగు పెడుతూ ఉండగానే పార్వతమ్మ ప్రశ్నించింది. "వెళ్లిన పని జరిగిందా? పిల్లలెవరూ రాలేదా? బట్టలేవీ తీసుకు రాలేదేం?"

విశ్వనాథం భార్య వంక చూసాడు.

"ఆ డబ్బు ప్రయాణంలో పోయింది పార్వతీ." విశ్వనాథం నవ్వాడు. ●

